సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 10 । మార్చి । 2023



బాధ్యతగా వైద్యసేవలు 8లో

పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సూచించారు.



పశువ్యాధుల పట్ల అప్రమత్తత

పశువులకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటస్వామి నాయుడు సూచించారు. 8లో



అన్ని రంగాల్లో అభివృద్ధి

మన్యాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని అఖిల భారత కారి ్క బోర్డు చైర్మన్ జయప్రకాష్ అన్నారు. 8లో

న్యూస్‌రీల్

జాతీయ మారథాన్ పోటీలకు గిరిజన క్రీడాకారుడు



గోపి

అనంతగిరి: మండలంలోని రొంపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొర్రా గోపి మారథన్ పోటీల్లో సత్తాచాటుతున్నాడు. ముంబైలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 10కె, 5కె రన్ మారథాన్ పోటీలకు ఎంపికైయ్యాడు. ఆంధ్రప్రదేశ్ తరపున గోపి మారథాన్ పోటీలో పాల్గొంటున్నాడు. దీంతో మండలస్థాయి అధికారులు గోపిని అభినందించారు. ఆర్థికంగా ప్రోత్సాహం అందిస్తే మరింతగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకొస్తానని కొర్రా గోపి తెలిపారు.

నేడు జల్లివారిగూడెంలో సర్వే

వీఆర్ పురం: పోలవరం ప్రాజెక్ట్ ముంపు గ్రామమైన జల్లివారిగూడెంలో శుక్రవారం స్ట్రక్చర్ (గృహాలు, ఇతర కట్టడాల విలువ అంచనా) సర్వేను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎన్.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత లబ్ధిదారులు సర్వే బృందాలకు సహకరించి సర్వే చేయించుకోవాలన్నారు. సర్వే ప్రక్రియకు సంబంధించి రేషన్, ఆధార్, ఓటర్ కార్డులతో పాటుగా ఇంటి పన్ను రసీదులను లబ్ధిదారులు అందుబాటులో ఉంచుకోని సర్వే సిబ్బందికి సమగ్ర సమాచారం అందిచాలని ఆయన సూచించారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేయండి

సాక్షి,పాడేరు: జిల్లాలోని 22 మండలాల్లోని 62 పీహెచ్‌సీ పరిధిలో ఈనెల 14న నిర్వహించే జాతీయ డీవార్మింగ్ డేను విజయవంతం ఏయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లను గురువారం ఆయన తన కార్యాలయంలో ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3,795 విద్యాలయాల్లో 3,07,839 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంటర్ విద్యార్థులందరికీ డీవార్మింగ్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు.14వ తేదీన పాఠశాలలకు రాని విద్యార్థులకు 18వతేదీన డీవార్మింగ్ మాత్రలు అందజేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, డీఈవో సలీంబాషా, ఏడీఎంహెచ్‌వో భారతి, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, పాడేరు జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌కు స్థల పరిశీలన



జడ్డంగిలో స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శుభంబన్సల్

రాజవొమ్మంగి: మండలంలో జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న పెట్రోల్‌బంక్‌కు అవసరమైన స్థలాన్ని సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ గురువారం పరిశీలించారు. ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న నేషనల్ హైవే 516ఈని ఆనుకొని ఈ బంక్ ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు జడ్డంగి శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 287/1లో 35 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిస్తామని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచారి, జీసీసీ డీఎం పార్వతీశ్వర్రావు, జీసీసీ స్థానిక మేనేజర్ విజయలక్ష్మి, వీఆర్వో నానాజీ పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి



శిక్షణలో పాల్గొన్న మహిళలు

రంపచోడవరం: విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీతో గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కృషి విజ్ఞానకేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త డా.టి. క్రాంతికుమార్ సూచించారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో కర్రపెండలం, చిలగడ దుంపలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఏర్పాటుచేసిన రెండు రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో కర్రపెండలం, చిలగడ దుంపలను గిరి రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయితే వారికి గిట్టుబాటు ధర లభించడం లేదు. వీటితో విలువ ఆధారిత ఉత్పత్తులైన చిప్స్, బిస్కెట్లు, మురుకులు, మిక్చర్, అప్పడాలు, సగ్గుబియ్యం, పాసా తయారు చేసి ఉపాధి పొందవచ్చు. ఇందుకు సంబంధించి శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కె.వీరాంజనేయులు, పి.రాజశేఖర్, ఎన్. చిరంజీవి, ఆర్.ప్రవీణ్‌బాబు పాల్గొన్నారు.

టార్గెట్ 2.56 లక్షల ఎకరాలు

- పెరగనున్న కాఫీ సాగు విస్తీర్ణం
- విత్తనాలు పంపిణీ చేసిన ఐటీడీఏ కాఫీ విభాగం
- చురుగ్గా నర్సరీ పనులు



నర్సరీ పనుల్లో నిమగ్నమైన గిరి రైతులు (ఇన్‌సెట్) కాఫీ నర్సరీల బెడ్లు

సాక్షి, పాడేరు : ఏజెన్సీలో గిరిజన రైతులను ఆదుకుంటున్న కాఫీ సాగుకు విస్తరణకు కసరత్తు మొదలైంది. 2025 నాటికి లక్ష ఎకరాల్లో కాఫీని అదనంగా సాగు చేసే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాఫీ ప్రాజెక్టును 2015లో ప్రారంభించాయి. ప్రస్తుతం ఏజెన్సీ వ్యాప్తంగా 1.56 లక్షల ఎకరాల విస్తీర్ణంలో కాఫీ తోటలు ఉన్నాయి. 2025 నాటికి 2.56 లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరగనుంది.

16 వేల ఎకరాల్లో..

2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 16వేల ఎకరాల్లో కొత్తగా కాఫీ సాగుకు గిరి రైతులను ఎంపిక చేశారు. గిరిజనుల సాగులో ఉన్న పోడు భూముల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు గిరిజన రైతులకు ఆదాయం లక్ష్యంగా పాడేరు ఐటీడీఏ కాఫీ సాగును ప్రోత్సహిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూములకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను కూడా పంపిణీ చేశారు.

సొంతంగా ఏర్పాటు

కాఫీ తోటల సాగుకు ఎంపికైన గిరిజన రైతులంతా తమ గ్రామాల్లోనే సొంతంగా కాఫీ మొక్కల నర్సరీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. 16వేల ఎకరాల కాఫీ సాగుకుగాను అవసరమయ్యే 2.29 కోట్ల కాఫీ మొక్కల పెంపకానికి గాను 8వేల కిలోల విత్తనాలను ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు పంపిణీ చేశారు.

కాఫీ నర్సరీల పనులను ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జూన్, జూలై నెలల్లో వర్షాలు కురిసే సమయానికి కాఫీ మొక్కలను గిరిజన రైతులకు పంపిణీ చేసే లక్ష్యంతో పాడేరు ఐటీడీఏ ఉంది. సిల్వర్‌ఓక్ తోటల్లో నాటుకుంటారు.

మండలాల వారీగా..

అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టులో ఒకొక్క మండలానికి వెయ్యి ఎకరాలకు గాను 14 లక్షలు, పాడేరు మండలంలో 1500 ఎకరాలకు 22.20 లక్షలు, జి.మాడుగుల మండలంలో రెండు వేల ఎకరాకలు రూ.27.20 లక్షలు, చింతపల్లి మండలంలో మూడు వేల ఎకరాలకు 37.20 లక్షలు, జీకే వీధి మండలంలో 2 వేల ఎకరాలకు 27.30 లక్షులు, కొయ్యూరు మండలంలో 1500 ఎకరాలు 22.20 లక్షల మొక్కల పంపిణీకి నిర్ణయించారు.

నర్సరీ పనుల్లో నిమగ్నం



గిరి రైతులు కాఫీ నర్సరీ పనుల్లో నిమగ్నమయ్యారు. 16వేల ఎకరాల్లో కొత్తగా కాఫీ సాగును విస్తరించే లక్ష్యంగా ఐటీడీఏ కాఫీ విభాగం పనిచేస్తోంది. ప్రస్తుతం ఏజెన్సీలోని 74 గ్రామాల్లో కాఫీ నర్సరీలను గిరిజన రైతులు నిర్వహిస్తున్నారు. అన్ని నర్సరీల్లోను ప్లాస్టిక్ బ్యాగులలో మట్టిని నింపి విత్తనాలు వేశారు.

– ఆర్.గోపాలకృష్ణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పాడేరు

ఓటు హక్కు సద్వినియోగం

- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- 95 శాతం మేర ఓటరు స్లిప్‌ల పంపిణీ : కలెక్టర్ సుమిత్‌కుమార్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శివశ్రీనివాస్,డీఆర్వో అంబేద్కర్

సాక్షి,పాడేరు: ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం తన చాంబర్‌లో ఓటు నమోదుకు సంబంధించి ×చేయదగినవి..చేయకూడనివి¤ ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాడేరు, అరకులోయ నియోజకవర్గాల పరిధిలో 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, పీవోలు, ఏపీవోలు, వివిధ విభాగాల ఇన్‌చార్జిలను నియమించినట్టు చెప్పారు. సుమారు 95 శాతం మేరకు ఓటర్ స్లిప్‌ల పంపిణీ పూర్తయ్యిందన్నారు.

బ్యాలెట్ పేపర్‌లో ఎలాంటి గుర్తులు ఉండవని,అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయన్నారు.పోలింగ్ బూత్‌లో సిబ్బంది వద్ద ఉన్న ఊదా రంగు స్కెచ్ పెన్ను మాత్రమే నమోదు చేయాలన్నారు. ఓటు హక్కు వినియోగంలో ఒకటి అంకె తప్పనిసరిగా వేయాలని, అలాకాకుండా 2,3 అంకెలను వేస్తే ఆ ఓటు చెల్లదన్నారు. తెలుగు, రోమన్ అంకెలు, అక్షరాలతో రాసినట్టయితే ఆ ఓట్లు తిరస్కరణకు గురవుతాయన్నారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, డీఆర్వో అంబేద్కర్ పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో సాధారణ సెలవు

విశాఖ విద్య: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 12,13 తేదీల్లో జిల్లాలో పోలింగ్ జరిగే ఇనిస్టిట్యూషన్స్/కార్యాలయాలకు సాధారణ సెలవు మంజూరు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. పాడేరు,అరకులోయ నియోజకవర్గాలకు సంబంధించి 11,525 మంది ఓటర్లు ఉండగా, 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐదు రూట్లు, ఐదు జోన్లుగా విభజించారు.

పోలింగ్‌కు సంబంధించిన మెటీరియల్, బ్యాలెట్ పేపర్లు పాడేరు చేరుకున్నాయి. పాడేరు తలారిసింగి పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్,తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.12వ తేదీ ఉదయం 8గంటల నుంచి ఎన్నికల విధులకు అధికారులంతా హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు.ఆర్టీసీ బస్సుల్లో బ్యాలెట్ బాక్స్‌లు, మెటీరియల్, ఎన్నికల అధికారులు, సిబ్బందిని 12వ తేదీ ఉదయం సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు.



బ్యాలెట్ పేపర్లు, మెటీరియల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నేడు ఆన్‌లైన్‌లో వన్డే టికెట్ల విక్రయం

- 14న ఆఫ్‌లైన్‌లో మూడు ప్రాంతాల్లో..

విశాఖ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో భారత్–ఆస్ట్రేలియాల మధ్య ఈనెల 19న జరగనున్న డేనైట్ వన్డే మ్యాచ్ టికెట్లను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఆన్‌లైన్‌లో విక్రయించనున్నారు. అభిమానులు పేటీఎమ్ paytmapp/paytminsiderapp/insider.in website ద్వారా టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి తెలిపారు. కనీస ధర రూ.600లు కాగా రూ.1500, రూ.2000, రూ.3000, రూ.3500, రూ.6 వేల వరకు ఆరు డినామినేషన్లలో టికెట్లు ఉంటాయన్నారు. ఆఫ్‌లైన్‌లో టికెట్లను ఈనెల 14న ఉదయం 10 నుంచి 4 గంటల వరకు వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్, మున్సిపల్ స్టేడియం, రాజీవ్‌గాంధీ క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా తీసుకున్న టికెట్లను 19న వైఎస్ఆర్ స్టేడియం బి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఫిజికల్ టికెట్లుగా మార్చుకోవచ్చన్నారు. మ్యాచ్‌ను 27 వేల మంది స్టేడియంలో ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉంది. వెస్టిండీస్ జట్టు భారత్‌తో ఇక్కడ 2019లో తలపడగా మూడున్నరేళ్ల తరువాత వన్డే మ్యాచ్ జరగనుంది.

కోడల్ని హతమార్చిన అత్త

- మద్యం మత్తులో కత్తితో దాడి
- తరచూ గొడవలే కారణం



బృంద కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ, (ఇన్‌సెట్) కోడలు బృంద మృతదేహం

ముంచంగిపుట్టు: మద్యం మత్తులో ఓ అత్త కత్తితో దాడి చేసి కోడల్ని హతమార్చిన సంఘటన మండలంలోని జర్రెల పంచాయతీ సెల్లుంపుట్టు గ్రామంలో చోటుచేసుకుంది. జి.మాడుగుల సీఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలాఉన్నాయి. మండలంలోని సెల్లుంపుట్టు గ్రామంలో భార్యాభర్తలు కోడా గోపాల్, బృంద నివసిస్తున్నారు. వీరికి ఎదురింటిలో గోపాల్ తల్లి దుహర్ని ఉంటోంది. ఆమె తరచూ మద్యం, జీలుగ కల్లు తాగి కోడలు బృందతో గొడవ పడుతుండేది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 9గంటల సమయంలో అత్త దుహర్ని పూటుగా మద్యం సేవించింది. కోడలు బృంద ఇంటికి వెళ్లి గొడవపడింది. చేతిలో ఉన్న కత్తితో కోడలు తల, వీపు,చేతి భాగాల్లో బలంగా దాడి చేసింది. దీంతో కోడలు బృందకు రక్తస్రావం కావడంతో స్పృహ కోల్పోయింది. దీంతో ఆమెను భర్త గోపాల్, కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. బృందను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. పోలీసు కేసు నమోదు కాకుండా ఉండేందుకుగాను మేడపై నుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయపడిందని వైద్యసిబ్బందికి చెప్పి మృతదేహాన్ని ఆస్పత్రి అంబులెన్సులో ఇంటికి తీసుకువెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి తమ్ముడు డొంబ్రు గురువారం ఉదయం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని ఎస్ఐ రవీంద్ర, జి.మాడుగుల సీఐ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే సీఐ సెల్లుంపుట్టు వెళ్లి భర్త గోపాల్, అత్త దుహర్ని, కుటుంబ సభ్యులను విచారించారు. గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం అనంతరం బృంద మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్



వంచులలో అధికారులతో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్

గూడెంకొత్తవీధి: విద్యుత్తు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ ఎల్. మహేంద్రనాథ్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని వంచుల గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ప్రమాదాల నివారణలో భాగంగా పాడైన విద్యుత్తు స్తంభాల స్థానంలో కొత్తవి అమర్చుతున్నామన్నారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో సుమారు 530 విద్యుత్ స్తంభాలను మార్పు చేశామన్నారు. చింతపల్లి ఏఈ వెంకటరమణ, చింతపల్లి , గూడెంకొత్తవీధి ఎల్ఐలు గంగరాజు,ప్రసాద్ పాల్గొన్నారు.

ఇద్దరు హెచ్‌ఎంల సస్పెన్షన్

సాక్షి,పాడేరు: విధులకు గైర్హాజరైన ఏజెన్సీలో ఇద్దరు గిరిజన సంక్షేమశాఖ హెచ్‌ఎంలపై సస్పెన్షన్ వేటుపడింది. పాడేరు మండలం మలకపాలం బాలుర ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం బి.శంకరరావు తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని ఫిర్యాదులు అందాయి. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమశాఖ డీడీ, పాడేరు ఏటీడబ్ల్యూవోలు విచారణ జరిపి, ఉమ్మడి విశాఖ నోడల్ కలెక్టర్ మల్లికార్జునకు నివేదించారు. దీంతో మలకపాలం హెచ్‌ఎం శంకరరావును సస్పెండ్ చేస్తూ గురువారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. కొయ్యూరు మండలం పెదమాకవరం బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎల్ఏఫ్ఎల్ హెచ్‌ఎం ఎం.బాలకుమారి విధులకు గైర్హాజరు అవడంతో ఆమెను సస్పెండ్ చేస్తూ గురువారం గిరిజన సంక్షేమశాఖ డీడీ ఎ.కొండలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

వైద్య సిబ్బందిపై పీవో కొరడా

- ధారకొండ పీహెచ్‌సీలో తనిఖీలు
- వైద్యాధికారి నాగభూషణ్, సీనియర్ అసిస్టెంట్ విధులకు డుమ్మా
- నెల జీతం నిలిపివేతకు ఆదేశం



వైద్య సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సీలేరు: ధారకొండ పీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ కొరడా ఝుళిపించారు. గురువారం ఆయన ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. వైద్యాధికారి నాగభూషణ్, సీనియర్ అసిస్టెంట్ నారాయణరావు విధులకు హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి నెలకు సంబంధించిన వారి ఇద్దరి జీతాలను నిలిపివేయాలని అధికారులకు ఆదేశించారు. రిజిస్టర్‌లో నమోదు చేయని ఎంపీహెచ్ఏ ఈసరమ్మ, సుభాషమ్మకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తక్షణమే ఐటీడీఏ పీవో కార్యాలయానికి హాజరుకావాలని ఆదేశించారు.వైద్యాధికారి హిమబిందు నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్యకేంద్రం వద్ద నిర్మించిన బెర్త్ వెయిటింగ్‌హాల్ నిర్మాణం వేగవంతం చేయాలని డీఈని ఆదేశించారు. అక్క శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించాలని సూచించారు. పెదవలసలో నిర్మించిన సీసీ రోడ్డును, చింతపల్లిలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి 8లో

గిరిజన చట్టాల పరిరక్షణ అందరి బాధ్యత

- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బులికృష్ణ



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బులికృష్ణ, వేదికపై పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్

అరకులోయ రూరల్: గిరిజన చట్టాలు, హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీవీ బులికృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ కళాశాల విద్యార్థుల సంయుక్తంగా గురువారం నిర్వహించిన అవగాహన సదస్సును పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కేవీవీ బులికృష్ణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ఆదివాసీలకు చట్టాలపై అవగాహన లేక హక్కులను కోల్పోతున్నరన్నారు. వీరికి గ్రామస్థాయి నుంచి విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా చైతన్యవంతులను చేయవచ్చన్నారు. గిరిజన చట్టాలు హక్కులపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో చట్టాలు హక్కులపై అవగాహన సదస్సులు ఏర్పాటు వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. గిరిజన ప్రాంతాల్లో యువతీ యువకులు సన్మార్గంలో ఉండేందుకు దోహదపడతాయన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఏవో రాంబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్ని రంగాల్లో అభివృద్ధి

కొయ్యూరు: మన్యాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని అఖిల భారత కార్మిక బోర్డు చైర్మన్ జయప్రకాష్ అన్నారు.గురువారం ఆయన బీజేపీ గిరిజన మోర్చా నేత కూడా కృష్ణారావుతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార నిమ్తిం కొయ్యూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలుగా లమ్మసింగి, చింతపల్లితో పాటు అనేక ప్రాంతాలను అభివృద్ధి చేస్తోందన్నారు. రాజమండ్రి నుంచి మన్యంలోని కాకరపాడు, చింతపల్లి, లమ్మసింగి మీదుగా పాడేరు, అరకు వరకు జాతీయర రహదారి 516–ఈ నిర్మాణం జరుగుతోందన్నారు. తాజంగిలో గిరిజన సమరయోధుల మ్యూజియానికి కేంద్రం నిధులు కేటాయించిందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన మాధవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్రగాయాలు

మాకవరపాలెం : లారీని మరో లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అన్‌రాక్ రిఫైనరీకి వస్తున్న లారీ శెట్టిపాలెం వద్దకు వచ్చేసరికి తొలుత ఎదురుగా వస్తున్న కారును ఢీకొని అనంతరం వెనుక వస్తున్న మరో లారీని బలంగా ఢీకొట్టింది. అన్‌రాక్‌కు వచ్చే లారీ డ్రైవర్ గాలి రమణ(50) నిద్ర మత్తులోకి వెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. ఈ సంఘటనలో రెండు లారీల డ్రైవర్లు అయిన నర్సీపట్నంకు చెందిన ఈశ్వరరావుతోపాటు అన్‌రాక్ లారీ డ్రైవర్ రమణలకు తీవ్రగాయాలయ్యాయని, వీరిలో రమణ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ తరలించారన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నిర్దిష్ట ఆహార నియమాలతో కిడ్నీలు పదిలం

పాడేరు రూరల్ : మానవ శరీరం నిర్మాణంలో కిడ్నీది కీలకపాత్ర అని ప్రతి ఒక్కరు తమ కిడ్నీలను జాగ్రత్తగా కాపాడుకోవాలని తద్వార ఆరోగ్యంగా ఉండాలని పాడేరు జిల్లా ఆస్పత్రి వైద్యుడు శ్రీనివాస రావు అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని బుధవారం పాడేరు జిల్లా ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆస్పత్రి వైద్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ సరైన ఆహార నియమాలతో కిడ్నీలు పదిలంగా ఉంటాయన్నారు. మద్యపానం, ధూమపానం తదితర వ్యవసనాలకు బానిసై కిడ్నీలను పాడు చేసుకోవద్దన్నారు. కిడ్నీ రోగులను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. జిల్లా ఆస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసిందన్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడే వారికి ప్రతి నెల రూ.10వేల పింఛన్ సదుపాయం కల్పిస్తోందన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలోకిడ్నీ రోగులకు నిత్యం మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని, డయాలసిస్ చేస్తున్నామన్నారు. ఈ అవకాశాలను కిడ్నీ రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఆస్పత్రి హెడ్ నర్సులు సుజాత, జయ, సరోజిని, పాడేరు ప్రభుత్వ నర్సింగ్ ట్రెనింగ్ కళాశాల అధ్యాపకురాలు జ్ఞానేశ్వరి, ఆస్పత్రి డలాయసిస్ ఇన్‌చార్జి రామ్మూర్తి, టెక్నీషియన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు

జోరుగా పోలింగ్ ఏర్పాట్లు

- పర్యవేక్షిస్తున్న ఆర్‌వో మల్లికార్జున
- ఇప్పటికే బ్యాలెట్ పేపర్ల పంపిణీ పూర్తి
- 1000 ఓట్లు దాటితే మూడో బ్యాలెట్ బాక్స్



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ మల్లికార్జున ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పోలింగ్ సామగ్రి పంపిణీ, తదితర అంశాలపై సమీక్షిస్తున్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో బ్యాలెట్ పేపర్ల పంపిణీ ప్రక్రియ గురువారం ఉదయానికి సజావుగా పూర్తయింది. పోలింగ్ స్టేషన్లకు అవసరమైన సామగ్రిని తరలించే ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. ఈ నెల 13న పోలింగ్ జరగనుండడంతో 11న సాయంత్రం 4 గంటలకు ప్రచారాన్ని ముగించాలని ఇప్పటికే బరిలో నిలిచిన అభ్యర్థులందరికీ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఎన్నికల విధులకు వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బందిని వినియోగించుకోవచ్చని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే ఎన్నికల విధులను ఉద్యోగులు, అధికారులకు అప్పగించామని.. అవసరమైతే సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవచ్చని బీఎల్‌వోలకు సూచించారు. మరోవైపు 56 పోలింగ్ బూత్‌ల పరిధిలో 1000కి పైగా ఓట్లున్నాయి. నిబంధనల మేరకు ఒక బ్యాలెట్ బాక్సులో గరిష్టంగా 500 ఓట్లు మాత్రమే ఉంచాలి. 500 ఓట్లు దాటిన ప్రతి పోలింగ్ స్టేషన్‌కు రెండు చొప్పున బ్యాలెట్ బాక్సులు అందిస్తున్నారు. 1,000 మందికి పైగా ఓటర్లున్న పోలింగ్ బూత్‌లలో మూడు బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేయనున్నారు. ఒక బ్యాలెట్ బాక్స్ నిండిన వెంటనే పోలింగ్ ఏజెంట్లు, అధికారులు, భద్రతా సిబ్బంది పర్యవేక్షణలో దానికి సీల్ వేయనున్నారు. ఇప్పటివరకు జిల్లా పరిధిలో మొత్తం 193 పోస్టల్ బ్యాలెట్స్‌కు దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో ఆయా ఉద్యోగులకు పంపిణీ ప్రక్రియ ప్రారంభించారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోకపోతే చెల్లని ఓటుగా మారిపోతుందనీ, ఓటర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ మల్లికార్జున సూచించారు.

దేశ పురోగతికి యువత ఉత్ప్రేరకం కావాలి

కశింకోట : ప్రజాస్వామ్య నైతికతకు యువత మద్దతుగా నిలవాలని ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఎం.ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకె) ఆధ్వర్యంలో కశింకోటలోని ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం సాయంత్రం «నైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు» అంశంపై నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. స్వచ్ఛ భారతదేశం కోసం నాయకులను నిర్మించడంలోను, ఆత్మ నిర్భర్‌గా మార్చడంలోను విద్యార్థులు ఉత్ప్రేరకంగా పని చేయాలన్నారు. యువతలో ఉన్న ఉత్సాహం భారత దేశాన్ని ఆర్థికంగా సాధికారత కలిగిన దేశంగా మారుస్తాయన్నారు. ప్రపంచంలో సమకాలీన సంస్కరణలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

సమాచారం, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచడానికి నెహ్రూ యువ కేంద్రం ప్రోత్సహిస్తుందన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ఆకలి నిర్మూలన, లింగ సమానత్వం, తక్కువ వ్యయంతో పరిశుభ్రమైన ఇంధనం, స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యం మెరుగుపరచడం వంటి అంశాలపై విద్యార్థులు దృష్టి నిలపాలన్నారు.

అటవీ శాఖ విశాఖ రేంజ్ అధికారి బిర్లంగి రామనరేష్, వ్యక్తిత్వ వికాస శిక్షకుడు ఎస్.వి.ఆర్ నాయుడు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి జి. మహేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు ఎస్.నాగేశ్వరరావు, ఎన్‌వైకె రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ గణేష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత లీలాప్రసాద్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ షఫీ మహమ్మద్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆది కవి నన్నయ్య యూనివర్శిటీ మాజీ వీసీ ముత్యాలనాయుడు

బాధ్యతగా వైద్యసేవలు

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సూచించారు. గురువారం ఆమె అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అందుబాటులో ఉన్న సౌకర్యాల వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులు ఖర్చు వివరాలను పరిశీలించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యసేవలు అందించడంలో తరచూ సిబ్బందిపై పిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారిలో అధిక శాతం పేదలే ఉంటారని, వారికి పూర్తిస్థాయిలో సేవలు అందించాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఆస్పత్రి బయట వీధి దీపాలు వేయించాలని, మార్చురీ వద్ద తుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు కోరారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అడ్డతీగల ఎంపీటీసీ వడ్లమూరి రత్నం, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలశాఖ అధ్యక్షుడు సామిదాల రాజా రమేష్ పాల్గొన్నారు.

పశువ్యాధుల పట్ల అప్రమత్తత

హుకుంపేట: పశువులకు వ్యాధులు సోకకుండా పాడి రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి వెంకటస్వామి నాయుడు సూచించారు. గురువారం ఆయన మండలంలోని కొట్నాపల్లి, మత్స్యపురం, చక్రిపుట్టు, పందిమెట్టు,పెదగరువు తదితర గ్రామాల్లో పశు విజ్ఞాన బడి నిర్వహించారు. సుమారు 1,229 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.అనంతరం ఆయన మాట్లాడారు. పాడి పశువులకు అంటు వ్యాధులు సోకి ప్రబలే అవకాశం ఉన్నందున గిరిజన రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులకు ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా వెంటనే స్థానిక పశు వైద్యాధికారులకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. మండల పశువైద్యాధికారి చరణ్ పాల్గొన్నారు.

గిరిజన యువకుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఉదయ్ శ్రీనివాస్

రంపచోడవరం: గిరిజన యువకుడు శ్రీనివాస్ గౌరవ డాక్టరేట్ అందుకోవడంతో పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. ది అమెరికన్ యూనివర్సిటీ యునైటెడ్ గ్లోబల్ పీస్ బెంగుళూరు గాంధీ భవన్‌లో గురువారం జరిగిన స్నాతకోత్సవంలో ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన మిత్ర స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఉదయ్ శ్రీనివాసుకు డాక్టరేట్ దక్కింది. ఈ సందర్భంగా అమెరికన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రోతిమా మధు క్రిషన్ శ్రీనవాస్‌కు డాక్టరేట్‌ను అందజేశారు. కొరియాకు చెందిన శాంతి రాయబారులు జాసన్ ఛా, లిసా కిమ్, కర్ణాటకకు చెందిన శాంతి రాయబారులు డాక్టర్ స్టెల్లా, డాక్టర్ సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

119 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

రాజవొమ్మంగి: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీలో గురువారం జరిగిన వైద్యశిబిరంలో 119 మంది గర్భిణులకు సేవలందించినట్లు డాక్టర్ సేవ సుజి, డాక్టర్ యామినిప్రియ తెలిపారు. రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామని వారు పేర్కొన్నారు. హైరిస్క్‌లో ఉన్న గర్భిణిని తమ పర్యవేక్షణలో ఉంచామన్నారు. హెచ్‌వీ వెంకటరమణ, స్టాఫ్ నర్స్ నాగలక్ష్మి, ఎల్టీ సత్యనారాయణ, ఫార్మసిస్ట్ దుర్గ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అదుపుతప్పి వాహనం బోల్తా



ఎర్రిగెడ్డ సమీపంలోని బోల్తా పడిన వాహనం

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం ఎర్రిగెడ్డ సమీపంలోని మలుపు వద్ద అరకు నుంచి మైదాన ప్రాంతానికి అల్లం లోడ్‌తో వెళుతున్న బొలేరో వాహనం గురువారం అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. బ్రేక్‌ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, వాహనచోదకులు కోరుతున్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పక్కన ఎంపీపీ రమేష్, జడ్పీటీసీ నూకరాజు, నేతలు

కొయ్యూరు: ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.కష్టాన్ని ఇష్టంగా మార్చుకుంటే జీవితంలో అనుకున్నది సాధించే అవకాశం ఉందన్నారు. కొయ్యూరు గురుకుల పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. ప్రణాళిక ప్రకారం చదివితే మార్కులు ఎక్కువగా వస్తాయన్నారు. పాఠ్యాంశాల్లో అనుమానాలుంటే ఉపాధ్యాయులతో మాట్లాడి వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.అనంతరం ఆమె ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుతో మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, నాయకులు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, మాజీ అధ్యక్షులు ఎస్ సూరిబాబు, నాయకురాలు సావిత్రి, వైస్ ప్రిన్సిపాల్ మోహన్,ఉపాధ్యాయులు తదితరులున్నారు.

108లో ప్రసవం



శిశువును కుటుంబసభ్యులకు అందజేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని బోయపాడు గ్రామానికి చెందిన కాకూరి చంద్రకు గురువారం పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో కొయ్యూరు మండలంలోని రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో (కాకరపాడు జంక్షన్ వద్ద)నొప్పులు తీవ్రమయ్యాయి.దీంతో ఈఎంటీ అర్జున్, ఆశ ఏఎన్ఎంల సహాయంతో ప్రసవం చేయించారు. చంద్ర మగబిడ్డకు జన్మనిచ్చింది. వారికి రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తరలించామని, తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు పైలెట్ మరిడిరాజు తెలిపారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కలెక్టర్ సుమిత్‌కుమార్

పెదబయలు: జాతీయ స్థాయిలో అండర్–17.అండర్–14 పోటీల్లో ఎంపికై న పెదబయలు సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందనలు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీల్లో విద్యార్థులు జె.మత్స్యరాజు, జి.లాలీప్రియ, డి.అఖిల్, పి.రవీంద్రనాథ్, జి.వైశి, లావణ్య ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులను కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ సిస్టర్ షారా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్టీ విభాగ ఇన్‌చార్జి ప్రసాద్‌కు అభినందనలు

పాడేరు రూరల్ : వైఎస్సార్‌సీపీ అనుబంధ ఎస్టీ విభాగం జోనల్(విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం) ఇన్‌చార్జిగా నియమితులైన కిముడు శ్రీనివాస ప్రసాద్ నాయుడును లోచలిపుట్టులో గురువారం జరిగిన కార్యక్రమంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస ప్రసాద్ నాయుడుకి దుశ్శాలువలు కప్పి పూలమాలలతో సత్కారించారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయనకు సూచించారు.